

రేపటి నుంచి నగరంలో హరిదాస ఉత్సవం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సంగీత సంభ్రమ ట్రస్టు, కాడు మల్లేశ్వర గెళెయర బళగ, మల్లేశ్వరం శ్యామలా కృష్ణ సంగీత సభల సంయుక్త ఆధ్వర్యంలో హరిదాస ఉత్సవం ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనుంది. మల్లేశ్వరంలోని కాడు మల్లేశ్వర ఆరుబయట రంగమందిరంలో ఇందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కాడు మల్లేశ్వర గెళెయర బళగ అధ్యక్షుడు టీకే శివరాం నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. హబ్బమహోత్సవ 188 లో భాగంగా ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుల కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అడ్డు తగులుతున్నారని... అర్ధంతరంగా ముగింపు

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలపై వాగ్వాదం
- మధ్యలోనే ముగిస్తున్నానని సీఎం ప్రకటన
- సీఎం తీరుపై విరుచుకుపడ్డ ప్రతిపక్షాలు



పరిషత్‌లో సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధన్యవాదాలు తెలిపే వేళ విధాన పరిషత్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. తన ప్రసంగానికి తరచూ అడ్డు తగులుతున్నారని, ముగించేశానని సీఎం పేర్కొన్నారు. శాసనసభ చరిత్రలో అర్ధంతరంగా ప్రసంగాన్ని ముగించిన సందర్భాలు లేవని, రాత్రి పొద్దుపోయేదాకా అయినా వేచి ఉంటామని ప్రతిపక్ష బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. బుధవారం పరిషత్ కార్యకలాపాలు 10.30 గంటలకు ప్రారంభం కాగా సీఎం సిద్ధరామయ్య గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 1.20 గంటల దాకా ముఖ్యమంత్రి సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు సామాన్యుల పాలిట వరంగా మారాయన్నారు. గృహజ్యోతి ద్వారా 1.6 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని, రాష్ట్రంలో ఆకలిరహితగా తీర్చాలని 1.38 కోట్ల కుటుంబాలకు అన్నభాగ్య పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం తొలుత బియ్యం ఇస్తామని ఆ తర్వాత నిరాకరించినా ఐదు కిలోల బియ్యానికి బదులుగా నగదు పంపిణీ చేస్తున్నామన్నారు. గృహలక్ష్మి గ్యారెంటీకి 1.21 కోట్ల దరఖాస్తులు వచ్చాయని, 1.17 కోట్ల మంది కుటుంబ పెద్దలైన మహిళలకు నెలకు రూ.2వేలు చొప్పున అందిస్తున్నామని తెలిపారు. యువనిధి పథకం ద్వారా లక్షమందికి యువతీ యువకులకు రూ.7.34 కోట్లు పంపిణీ చేశామన్నారు. శక్తి గ్యారెంటీ ద్వారా కోట్లాదిమంది సద్వినియోగం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీలు అమలైతే ఆర్థికంగా దివాళా తీసినట్టేనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారన్నారు. ఇందుకు ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారి తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రధాని అటువంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. మరోసారి సీఎం ప్రసంగాన్ని కొనసాగిస్తూ 111 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తులను లక్ష్యంగా పెట్టుకున్నామని, తీవ్రమైన కరువు రావడంతో 48 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని, 18 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తుల కొరత ఏర్పడిందన్నారు.

- గడిచిన పదేళ్ల దేశంలో సామాన్య వర్గాల జీవనం కష్టంగా మారిందన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ సూచిక మేరకు 2014లో 76దేశాలలో జరిపిన సర్వేలో భారత్ 55 శాతం, 2023లో 125 దేశాలలో జరిపిన సర్వేలో



గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతున్న సీఎం

111వ స్థానానికి చేరిందని ఎక్కడ ప్రగతి సాధించినట్టు అని ప్రశ్నించారు. ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశమంతటా మోదీ శక్తి అంటుంటే తప్పుడు నివేదికలను సభలో చదువుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలోనే జేడీఎస్ సభ్యుడు శరవణ కూడా అభ్యంతరం తెలిపారు. అందుకు ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఇండెక్స్ గురించి వివరించాలని డిమాండ్ చేశారు. దేవెగౌడ నుంచి తానేమీ మాట్లాడలేదని అయినా ఎందుకు నిలబడతావంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష బీజేపీ సభ్యులు సభకు తప్పుడు లెక్కలు ఇస్తున్నారని మండిపడ్డారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే సందర్భంలో బీజేపీ సభ్యురాలు భారతిశెట్టి మాట్లాడుతూ క్రికెట్‌లో బ్యాటింగ్ చేశాక బౌలింగ్ వద్దంటే ఎలాగని తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇదెక్కడి క్రికెట్ అని మండిపడ్డారు. అంతలోనే సీఎం సిద్దరామయ్య ఒక్కసారిగా తన ప్రసంగాన్ని ముగిస్తున్నానని, ఇక ఈ అంశంపై మాట్లాడేది లేదని, తరచూ అడ్డు తగులుతుంటే ఎలా ప్రసంగించాలని తేల్చి చెప్పారు.

- సభలో ఒక్కసారిగా గందరగోళ వాతావరణం ఏర్పడింది. ముఖ్యమంత్రి హోదాలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేవేళ అర్ధంతరంగా ముగిస్తానంటే ఎలాగని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. సభాపతి బసవరాజహొరట్టి కలాపాలు ఆరంభం కాగానే రాత్రి పొద్దుపోయే దాకా అయినా సీఎం ప్రసంగం ముగిస్తారని హామీ ఇచ్చారన్నారు. అందుకు అనుగుణంగా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ అధికారులు ఇచ్చే చీటీలు ముగిశాయని, మధ్యలోనే ఆపేయడం ఇదెక్కడి విధానమని నిలదీశారు. అధికార పార్టీకి చెందిన సభా నాయకుడు బోసరాజు, మంత్రి జమీర్ అహ్మద్, సభ్యులు వెంకటేశ్ సహా పలువురు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ముఖ్యమంత్రి మాట్లాడే అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. సభాపతి మరోసారి అర్ధంతరంగా ప్రసంగం ఆపరాదని ముఖ్యమంత్రికి సూచించారు. తన ప్రసంగం ముగించానంటూ సీఎం స్పష్టం చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ప్రతిపక్ష సభ్యులు సీఎం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బహిష్కరించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు లేకుండానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సీఎం ప్రసంగానికి ఆమోదించారు.



ప్రతిపక్షాల తీరుపై మంత్రులు దినేశ్ గుండూరావు, ప్రియాంకఖర్గే అభ్యంతరం



అధికార పార్టీ సభ్యులు



బీజేపీ సభ్యుడు రవికుమార్, ప్రతిపక్ష నేత కోట శ్రీనివాసపూజారి

సమాఖ్య వ్యవస్థకు మోదీ ప్రమాదకరం

- రాష్ట్రాలు శక్తివంతమైతేనే దేశం భద్రం : సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాఖ్య వ్యవస్థకు ప్రధాని నరేంద్రమోదీ ప్రమాదకరమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. విధానపరిషత్‌లో బుధవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ఆయన మాట్లాడుతూ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 50 శాతం పన్నుల వాటా కోరారని, ప్రధానమంత్రి హోదాలో కర్ణాటకకు కేవలం 12 శాతం మాత్రమే వాపసు ఇస్తున్నారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను సభలో వివరించారు. 2018-19లో కేంద్ర బడ్జెట్ రూ.24.44 లక్షల కోట్లు కాగా అప్పట్లో రాష్ట్రానికి రూ.51వేల కోట్లు మాత్రమే ఇచ్చారని, 2020-21లో రూ.30.42 లక్షల కోట్లు బడ్జెట్‌లో రూ.31వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. 2021-22లో రూ.34.83 లక్షలకోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.48.58 వేల కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. 2023-24లో రూ.45.03 లక్షల కోట్లకు గాను రాష్ట్రానికి రూ.50వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. దేశంలోనే పన్నుల చెల్లింపులో మహారాష్ట్ర తర్వాత కర్ణాటక రెండోస్థానంలో ఉందన్నారు. కేంద్ర బడ్జెట్ ఏటా పెరుగుతోందని రాష్ట్రానికి వచ్చే వాటా తగ్గుతోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా డిమాండ్ చేస్తే వ్యతిరేకమని వాదిస్తారన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు, బీజేపీ నాయకులు పన్నుల వాటాను పూర్తిస్థాయిలో తీసుకొస్తే కోటి నమస్కారాలు పెడతామన్నారు. రాష్ట్రాలు శక్తివంతమైతేనే దేశం భద్రంగా ఉంటుందన్నారు. ప్రధానమంత్రి మోదీకి అబద్ధాలు చెప్పడం పరిపాటిగా మారిందని, బీజేపీ సభ్యులు కూడా వాటినే కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ విధానాల ప్రకారం సమాఖ్య వ్యవస్థను రూపొందించారన్నారు. దేశమంతటా దీన్ని అంగీకరించారని, దీన్నే కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటారన్నారు. గత పదేళ్లుగా రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రం నుంచి రూ. లక్షల కోట్లు పన్నుల రూపంలో కేంద్రానికి అందుతోందని, వారు వేల కోట్లు విదిలిస్తున్నారన్నారు. ప్రజాప్రభుత్వానికి ఆపరేషన్ కమల వంటి విధానాలు కీడు చేస్తాయన్నారు. ఇదే సందర్భంలోనే ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారితోపాటు మరో బీజేపీ సభ్యుడు రవికుమార్‌ను ఉద్దేశించి తాను శూద్రుడినని, మీరు కూడా శూద్రులేనని ఎందుకిలా... జరుగుతోందని ప్రశ్నించారు. బలమైన ప్రతిపక్షాలు ప్రజాప్రభుత్వానికి శక్తినిస్తాయన్నారు. ప్రస్తుతం జేడీఎస్ కాస్త జేడీసీ (సీ ఫర్ కమ్యూనల్)గా మారిపోయిందన్నారు.

ఎమ్మెల్సీగా పుట్టణ్ణ ప్రమాణం



పుట్టణ్ణతో ప్రమాణం చేయిస్తున్న సభాపతి బసవరాజహొరట్టి

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టీచర్స్ ఎమ్మెల్సీ సభ్యుడిగా విజయం సాధించిన పుట్టణ్ణచే విధానపరిషత్‌లో బుధవారం సభాపతి బసవరాజహొరట్టి ప్రమాణం చేయించారు. ఇదే సందర్భంగా మరోసారి పరిషత్ సభ్యుడిగా విజయం సాధించి సభలోకి ప్రవేశించినందుకు సభాపతి ప్రత్యేకంగా అభినందించారు. విధానపరిషత్‌కు సంబంధించిన నిబంధనలు పుస్తకాల ప్రత్యేక కిట్‌ను అందించారు. అనంతరం మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ సభ్యులు పుట్టణ్ణను అభినందించారు. ఇప్పటికే జేడీఎస్, బీజేపీ నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరించిన పుట్టణ్ణ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవల ఎన్నికలు జరగగా మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ ముగిసింది. పుట్టణ్ణ సమీప ప్రత్యర్థి బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ఏపీ రంగనాథ్‌పై గెలిచారు. వరుసగా పుట్టణ్ణ రెండోసారి ఆయనపై హోరాహోరీ పోరులో విజయం సాధించారు.

రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేయలేదు

- మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రాంట్లు, పన్నుల వాటా విషయంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి ఎలాంటి అన్యాయం జరగడం లేదని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత బసవరాజ్ బొమ్మై పేర్కొన్నారు. శాసనసభలో బుధవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన అన్ని పథకాలకు సంబంధించి నిధులు నిరాటంకంగా వస్తూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ గ్యారెంటీగా చెప్పుకునే అన్నభాగ్య బియ్యంలో కూడా 5కిలోలు కేంద్రానివేనన్నారు. ప్రజలను దారి తప్పించేలా కాంగ్రెస్ నేతలు కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నారని తెలిపారు. ఇవి పూర్తిగా నిరాధారమన్నారు. సర్‌చార్జ్, సెస్ విషయంలోనూ ఎలాంటి అన్యాయం జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఐదేళ్ల అవధిలో జీఎస్టీ వాటాల రూపంలో రాష్ట్రానికి రూ.1,06,228 కోట్లు వచ్చాయన్నారు. అలాంటప్పుడు నష్టం ఎక్కడ జరిగిందని ఆయన ప్రశ్నించారు. 2012 జనాభా ఆధారంగా రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీఎం గగ్గోలు పెడుతున్నారన్నారు. ఒకవేళ రాష్ట్రానికి అన్యాయం జరిగిందనుకున్నా కేంద్రాన్ని అడగాల్సిన తీరు వేరేగా ఉంటుందన్నారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై కయ్యానికి దిగిందని విరుచుకుపడ్డారు. జల జీవన్ పథకంలో కేంద్రం రాష్ట్రానికి 50 శాతం గ్రాంటు ఇస్తోందని, స్వచ్ఛభారత్, కిసాన్ సమ్మాన్ పథకాలను ప్రస్తావించిన ఆయన కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా రాష్ట్రంలోని 60లక్షల మంది రైతులకు కేంద్రం రూ.14వేల కోట్లు ఇచ్చిందన్నారు. రైల్వే పథకాలకు రూ.7వేల కోట్లు విడుదల చేసిందన్నారు. స్మార్ట్‌సిటీ పథకానికి కూడా విరివిగా నిధులు మంజూరవుతున్నాయన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్యారెంటీ పథకాలే తప్ప అభివృద్ధి పట్టడం లేదన్నారు.



శాసనసభలో మాట్లాడుతున్న మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై

గ్యారెంటీలపై క్షేత్రస్థాయి పరిశీలన

- 1.2 లక్షల మంది స్వయంసేవకులు
- ఇంటింటికి తిరిగి వివరాల సేకరణ

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గృహలక్ష్మి, శక్తి, యువనిధి, గృహజ్యోతి, అన్నభాగ్య గ్యారెంటీ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందే దిశలో ప్రభుత్వం గ్యారెంటీ స్వయం సేవకులను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేశారు. ఇందుకోసం 1.2 లక్షలమంది గ్యారెంటీ స్వయం సేవకులను నియమిస్తారు. 10-15 రోజుల అవధిలో ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహధనం అందజేస్తారు. ఒక్కో గ్యారెంటీ స్వయం సేవకుడికి 100-120 ఇళ్ల బాధ్యతను అప్పగిస్తారు. స్వయం సేవకులు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి గ్యారెంటీ పథకాలు అందుతున్నదీ లేనిదీ స్వయంగా పరిశీలిస్తారు. ఒకవేళ అందని పక్షంలో ఇందుకుగల కారణాలను నమోదు చేసుకుంటారు. సమీక్ష అనంతరం ప్రత్యేక నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు. నియోజకవర్గాలవారీగా గ్యారెంటీ పథకాల అమలు తీరుతెన్నులను ఈ సమీక్ష ద్వారా తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్యారెంటీ స్వయం సేవకుల నియామక ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. ఈ సమీక్ష కోసం మొత్తం రూ.12 కోట్లు ఖర్చు కానున్నట్టు తెలిపారు. గ్యారెంటీ స్వయం సేవకులుగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వివిధశాఖల సిబ్బంది సేవలను కూడా వినియోగించుకోనున్నారు. కాగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తున్న సంగతి విదితమే. అయితే రాష్ట్రంలో మాత్రం గ్యారెంటీ సేవకులు కేవలం ఈ పథకాల సమీక్షకు మాత్రమే పరిమితం కానున్నారు.

రామమందిర దర్శనానికి అనూహ్య స్పందన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరాన్ని రాష్ట్రం నుంచి సాధ్యమైనంతమంది భక్తులు సందర్శించేలా బీజేపీ చేపట్టిన ప్రత్యేక అభియానకు అనూహ్య స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. ఈ మేరకు నగరంలో బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరులోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైళ్లలో భక్తులు పెద్ద సంఖ్యలో అయోధ్యకు వెళుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి శ్రీరామచంద్రుడి దర్శనం కోసం వెళ్లే భక్తులకు భోజన వసతి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రత్యేకించి అదమ్య చేతన కూడా చక్కటి ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. ఈ యాత్రలో పాల్గొంటున్న బెంగళూరు దక్షిణ జిల్లా రైతు మోర్చా కార్యవర్గ సభ్యుడు పీసీ హరినాయుడు నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, సీనియర్ నేత డీటీ విజయేంద్ర భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారని, అయోధ్య పర్యటనతో భక్తులు ఆనంద పారవశ్యానికిలోనవుతూ గొప్ప అనుభూతి పొందుతున్నారని చెప్పారు. రాజధాని బెంగళూరు నుంచే కాకుండా రాష్ట్రంలోని ప్రముఖ నగరాలు, పట్టణాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు అయోధ్యను సందర్శించారన్నారు.



అయోధ్యకు బయల్దేరిన భక్తులు

26 నుంచి భారీ ఉద్యోగ మేళా

- ఏర్పాట్లు పూర్తి
- ప్రారంభానికి సీఎం రాక
- మంత్రులు శరణప్రకాష్ పాటిల్, ప్రియాంక ఖర్గే

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యువ సమృద్ధి సమ్మేళనం పేరిట రాష్ట్రస్థాయిలో భారీ ఉద్యోగ మేళాను ఈ నెల 26 నుంచి రెండు రోజుల పాటు బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరగనుంది. ఈ ఉద్యోగ మేళాను ముఖ్యమంత్రి సిద్దరామయ్య లాంఛనంగా ప్రారంభించనున్నారు. సచివాలయంలో ఈ విషయాన్ని మంత్రులు డాక్టర్ శరణప్రకాష్ పాటిల్, ప్రియాంక ఖర్గే బుధవారం మీడియాకు చెప్పారు. ఈ ఉద్యోగ మేళాలో 600కు పైగా ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని, గరిష్ఠంగా 1.10 లక్షల ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ మేళాలో పాల్గొనేందుకు ఇంతవరకు 31వేల మంది నిరుద్యోగులు తమ పేర్లను రిజిష్టర్ చేసుకున్నారన్నారు. ఈ మేళా ద్వారా కనీసం 50వేల మందికి ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. రాష్ట్రం నుంచి ప్రతియేటా పీయూసీలో 9.32 లక్షల మంది, ఐటీఐలలో 62వేల మంది, పాలిటెక్నిక్‌లలో 48 వేల మంది, డిగ్రీ కళాశాలలో 4.80 లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారని తెలిపారు. వీరికి అవసరమైన నైపుణ్య శిక్షణను అందించే ఏర్పాట్లు చేశామని ఫలితంగా ప్రైవేట్ కంపెనీల అవసరాలకు తగ్గట్లుగా నిరుద్యోగ యువతను సన్నద్ధం చేస్తున్నామని మంత్రులు వివరించారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకం యువనిధి ద్వారా లబ్ధి పొందేందుకు ఇంతవరకు 1.32 లక్షల మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, వీరిలో 22 వేల మంది ఖాతాల్లోకి నగదు బదిలీ జరిగిందన్నారు. కాగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని, ఫలితంగా నేడు దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకు ప్రతియేటా 2 కోట్ల చొప్పున గత పదేళ్ల అవధిలో 20 కోట్ల ఉద్యోగాల సృష్టి జరగాల్సి ఉండగా లక్షల సంఖ్య లో మాత్రమే ఉద్యోగాలు దక్కాయన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడంతో దాదాపు 12 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని మంత్రులు పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఉద్యోగ మేళాకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని మేళాకు హాజరయ్యే నిరుద్యోగుల కోసం మెజిస్టిక్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు డాక్టర్ శరణప్రకాష్ పాటిల్, ప్రియాంక ఖర్గే



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.62	1,608.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	586	9,323
సామర్థ్యం (టీఎంసీలు)	9.16	35.22

పార్టీని బలోపేతం చేస్తాం

జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ



మాట్లాడుతున్న జేడియస్ జిల్లాధ్యక్షుడు మీనళ్ళితాయణ్ణ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 21: పలు కారణాలచే పార్టీని వదిలిన నాయకులు, ప్రముఖులు మరల పార్టీలో చేరేవిధంగా కృషిచేస్తానని పార్టీని కిందస్థాయి నుంచి బలోపేతం చేస్తానని జేడియస్ జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ తెలిపారు. నగరంలోని జేడియస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి తదితర ప్రముఖులు తనపై నమ్మకం పెట్టుకుని రెండవవిడత జిల్లాధ్యక్షునిగా నియమించారన్నారు. తనపై వారు నాపై ఉంచిన నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు. తాను ఎప్పుడు అధికారానికి ఆశపడలేదని, న్యాయానికి కట్టుబడి పనిచేస్తానన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అధిష్టానం సూచించిన అభ్యర్థులకై రాత్రి పగలు శ్రమిస్తానన్నారు.

ఈసందర్భంగా సండూరు కురేకుప్ప సోమప్ప, కంప్లి రాజునాయక్, విజయనగర జిల్లాధ్యక్షుడు కొట్రేశ్, బైలూరు లక్ష్మీకాంత్‌రెడ్డి, వంద్రి, అద్దిగేరి రామణ్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంత కంటే ముందు నగరంలోని జేడియస్ జిల్లాకార్యాలయంలో విశేష హోమ, హవన, విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా గత కొన్నిసంవత్సరాల నుంచి బోసిపోయిన కార్యాలయం జనంతో కిక్కిరిసి పోయింది.


అసలు చెల్లించిన రైతులకు వడ్డీ మాఫీ



అమాజీ హేమన్న

కంప్లి, ఫిబ్రవరి 21: పీఎల్‌డీ బ్యాంకుల్లోరుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 29లోపు అసలు పూర్తిగా చెల్లించినట్లయితే వారికి వడ్డీ మాఫీ అవుతుందని పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు అమాజీ హేమన్న తెలిపారు. వారు బుక్కసాగరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించిందన్నారు. ప్రతి ఒక్క ఖాతా దారుడు తమ పీఎల్‌డీ బ్యాంకు కార్యదర్శితో చర్చించి తాము తీసుకున్న రుణాలపై చర్చలు జరిపి రుణం అసలు మొత్తం కట్టీ వడ్డీని మాఫీ చేయించుకోవాలని కోరారు. ప్రతి ఒక్క రైతు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభ్యుదయ రైతు మృతి



తాతారావు(ఫైల్)

కంప్లి, ఫిబ్రవరి 21: సిరిగేరి సమీపంలోని ముద్దటనూరు క్యాంపు లో వుంటున్న తాతారావు(85) అనే అభ్యుదయ రైతు అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనగత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండేవారు. ఆయన రైతుల కోసం అనేక పోరాటాలు చేసి, వ్యవసాయ రంగంలో ఆదర్శ రైతుగా నిలిచారు. ఆయన మృతికి పలువురు రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ఆయన కుమారుడు సూరిబాబు ముద్దటనూరుప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్షులుగా వున్నారు. ఆయన స్వస్థలం హావినాళ్ గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

కోర్టు ఆవరణలో సీనియర్ లాయర్ మృతి



లాయర్ సోమనాథ్

గంగావతి రూరల్, ఫిబ్రవరి 21: సీనియర్ లాయర్ సోమనాథ్ బుధవారం కోర్టు ఆవరణలో గుండెపోటుతో మృతి చెం దారు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు, భార్య ఉన్నారు. సోమనాథ్ సేవలను పలువురు కొనియాడారు. ఆయన నిరాడంబర వ్యక్తి అని, మానవత్వ విలువలు కలిగిన మనిషని తోటి లాయర్లు శ్రద్ధాంజలి ఘటించారు.

డీలాపడ్డ జీన్స్ పరిశ్రమ

- స్ట్రెచ్చబుల్ రకాలు రావడంతో కాటన్ జీన్స్‌కు డిమాండ్ తగ్గుదల
- బళ్లారి వదిలి వెళ్లిపోతున్న వ్యాపారులు
- ప్రభుత్వం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రోత్సహిస్తేనే మనుగడ

బళ్లారి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బళ్లారి జీన్స్ పరిశ్రమ నేడు పూర్తిగా డీలా పడిపోయింది. పెరుగుతున్న సాంకేతిక పరమైన మార్పులతో పాటు ఎగుమతులు కూడా బాగా తగ్గిపోవడంతో కొందరు ఇప్పటికే పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించుకుని వెళ్లిపోయారు. ఫలితంగా జీన్స్ పరిశ్రమలే ఆధారంగా జీవనం సాగించే వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయి.

బళ్లారి నగరంలో అధికారిక రికార్డుల ప్రకారం సుమారు 500 జీన్స్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. వీటి ఆధారంగా సుమారు 25వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. అయితే కోవిడ్ అనంతరం మార్కెట్ పుంజుకోలేక పోయింది. లావాదేవీలు బాగా తగ్గిపోయాయి. వెరసి జీన్స్ ఎగుమతులు కూడా చాలా వరకు నిలిచిపోయాయి.



కాటన్ జీన్స్ పరిశ్రమలో బట్టలు తయారవుతున్న దృశ్యం

మౌలిక సదుపాయాలు కల్పించాలి



- పొలాక్స్ జీన్స్ కంపెనీ యజమాని మల్లికార్జున

ప్రభుత్వం 20 ఏళ్ల క్రితమే గార్మెంట్ పారిశ్రామిక వాడ ఏర్పాటుకు హలదల్లి వద్ద 60 ఎకరాల స్థలం కేటాయించింది. ప్రస్తుత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాదయాత్ర నేపథ్యంలోనూ బళ్లారిలో గార్మెంట్ పరిశ్రమల అభివృద్ధికి రూ.5వేల కోట్లు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సిద్దరామయ్య సర్కారు 2024 ఆర్థిక బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతిక పరికరాల కారణంగా ఇంటిలో దుస్తులు కుట్టేవారికి జీవనోపాధి కష్టంగా మారింది. సాంకేతిక పరికరాలను అందించి, ప్రభుత్వం జీన్స్ తయారీదారులను ప్రోత్సహిస్తే జీన్స్ పరిశ్రమ కష్టాల నుండి బయట పడుతుందని పొలాక్స్ జీన్స్ కంపెనీ యజమాని మల్లికార్జున అభిప్రాయం వ్యక్తం చేశారు.

పెరుగుతున్న సాంకేతికత కారణంగా జీన్స్ దుస్తుల తయారీ బాగా దెబ్బతింది. వాస్తవానికి న్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారణంగా కాటన్ జీన్స్‌కు డిమాండ్ తగ్గిందని కొందరు వ్యాపారులు అంటున్నారు. అదే యంత్రాలతో జీన్స్ దుస్తులు కుట్టడం, అలాగే దారం వేయడం, ఇస్త్రీ చేయడం, ఇలా అన్నీ మిషన్ ద్వారా చేసే కొత్త సాంకేతికత అందుబాటులోకి రావడంతో స్ట్రెచ్చబుల్ జీన్స్‌కు డిమాండ్ పెరిగింది. కొత్తగా తయారయిన ఈ జీన్స్ దుస్తులు ఆకర్షణీయంగా ఉండడంతో మార్కెట్‌లో వాటిని కస్టమర్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీని కారణంగా కాటనేజ్ పరిశ్రమలు పూర్తిగా జీవనోపాధి కోల్పోతున్నాయని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత కాలం ఇంటిలో దుస్తులు కుట్టి జీవనం సాగించే వారికి ప్రస్తుతం మెటీరియల్ ఇచ్చేవాళ్లు కూడా లేకుండా పోయారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వ్యాపారులు:

గతంలో వివిధ రాష్ట్రాల నుంచి జీన్స్ ఉత్పత్తి, క్రయ, విక్రయాల కోసం పలువురు వ్యాపారులు బళ్లారికి వచ్చారు. కాని ప్రస్తుత నేపథ్యంలో ఇక లాభంలేదని చాలా మంది జీన్స్ వ్యాపారులు, కంపెనీదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. చిన్నా పెద్దా ఇలా దాదాపు సుమారు వందకుపైగా కంపెనీలు బళ్లారి వదిలి వెళ్లిపోయాయి.

విజ్ఞానంతోనే మానవ అభివృద్ధి

సిరుగుప్ప, ఫిబ్రవరి 21 : విజ్ఞానం మనిషి ఎదుగుదలకు కారణమవుతుందని విద్యాశాఖ సీఆర్పీ మహమ్మద్ ఫయాజ్ అభిప్రాయపడ్డారు. సిరుగుప్ప తాలుకా టెక్కలకోట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విజ్ఞాన వస్తు ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని మహమ్మద్ ఫయాజ్ ప్రారంభించి మాట్లాడారు. నేటి రోజుల్లో విద్యార్థులు విజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టెక్కలకోట ఎస్‌ఐ సంగమేశ్వరి, పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెనికల్ గ్రామంలో రాజ్యాంగ జాతా

గంగావతి రూరల్, ఫిబ్రవరి 21: గంగావతి తాలూకాలోని బెనికల్ గ్రామంలో ప్రజలను చైతన్య పరచేందుకు రాజ్యాంగ అవగాహన జాతా నిర్వహించారు. జాతాలో రాజ్యాంగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సమాజ కళ్యాణ అధికారి శరణప్ప, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మహేశ్ అనేక మంది అధికారులు పాల్గొన్నారు.

జేడీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజునాయక్



రాజు నాయక్(ఫైల్)

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 21 : బళ్లారి రూరల్ నూతన జేడీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజు నాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందింది. ఆయన బళ్లారి జిల్లా జేడీఎస్ పార్టీ నూతన అధ్యక్షులు మీనళ్లి తాయన్నను అభినందించేందుకు బళ్లారికి రాగా జేడీఎస్ ప్రముఖులు కురేకుప్ప సోమప్ప, కిరణ్ కుమార్, ప్రసాద్, వంద్రి, పలువురు జేడీఎస్ ప్రముఖులు అభినందనలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఆంధ్ర, కర్ణాటక పోలీసుల సమావేశంలో తీర్మానం

బళ్లారి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రకు మద్యం అక్రమంగా హద్దులు దాటకుండా రాష్ట్రాల సరిహద్దులో గట్టి పోలీస్ నిఘా ఉంచుతామని కర్ణాటక- ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారులు పేర్కొన్నారు. బళ్లారి నూతన డి.సీ భవనంలో బుధవారం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని సెబ్, పోలీస్ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయనగర జిల్లా పరిధిలోని ఎక్సైజ్ ఉన్నతాధికారిణి శైలజా అధ్యక్షత వహించారు. కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గం, విజయనగర(హోస్పేట్), అలాగే ఆంధ్రలోని అనంతపురం, కర్నూలు జిల్లాలోని సరిహద్దులో ఉండే డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, విడపనకల్లు, ఆలూరు, అలర్వి, మండలాల పరిధిలో ఉండే పోలీస్ అధికారులు, ఎక్సైజ్, సెబ్‌అధికారులు పాల్గొన్నారు.



ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు మీటింగ్‌లో పాల్గొన్న పోలీసుఅధికారులు

కర్ణాటకలోనూ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో కర్ణాటకలోని బళ్లారి, విజయనగర, చిత్రదుర్గం జిల్లాల నుండి మద్యం, లేదా డబ్బు, ఎన్నికలకు అక్రమంగా వాడే వివిధ వస్తువులు రవాణాను జరగకుండా సరిహద్దు పోలీసులు ఒకరికొకరు సమాచారంతో గట్టి నిఘా ఉండేలా చూసుకోవాలని తీర్మానించారు. అలాగే సరిహద్దులో ఉండే అక్రమ దారులు, లైసెన్సు మద్యం షాపులు, అలాగే సెబ్ అధికారులు పరిధిలో ఉండే అనేక అంశాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో బళ్లారి జిల్లా ఎక్సైజ్ డి.సీ మల్లినాథ్. చిత్రదుర్గం మాంతేష్, కర్నూలు, అనంతపురం జిల్లాల సెబ్ అధికారులు, సరిహద్దు మండలాల పోలీసులు పాల్గొన్నారు.

భద్ర డ్యామ్ నుంచి నదికి నీటి విడుదల



భద్ర డ్యామ్ నుంచి విడుదలైన నీరు

కంప్లి, ఫిబ్రవరి 21 : విజయనగర జిల్లా హూవినఅడగళి తాలుకాలో 26న జరుగనున్న మైలారలింగేశ్వర జాతర సందర్భంగా భద్ర డ్యామ్ నుంచి తుంగభద్ర నదికి మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు విన్నపం మేరకు నీటిని విడుదల చేశామని, నది ఒడ్డున వున్న రైతులు నీటిని మళ్లిస్తే చర్యలు తప్పవని అధికారులు సూచించారు. ఈ నీరు యాత్రికులకు, పశుపక్ష్యాదులకు ఉపయోగపడేలా చూడాలన్నారు.

నీటి కొరతతో చేపల మృతి

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 21:సిరుగుప్ప తాలూకా తెక్కలకోట ముదేనూర్ గ్రామం శనేశ్వర దేవాలయ సమీపంలోని చెరువులో వేలసంఖ్యలో చేపలు మృతిచెందాయి. తెక్కల కోట గ్రామం ముదేనూర్ బలకుంది సమీపంలోని హగరి నదిపై శనేశ్వరాలయం సమీపంలో గుంతలో వేల సంఖ్యలో చేపలు ఇతర జలచరాలు మృతి చెందాయి. వర్షాకాల ప్రారంభం నుంచి వర్షాలు తక్కువగా కురవడంతో హగరి నదిలో నీటిప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది. గుంతలో నీటిని వదలకుండా రైతులు వాడుకోవడం వల్లే చేపలు చనిపోయాయని స్థానికులు తెలిపారు.

సండూరులో ఘనంగా రాజ్యాంగ అవగాహన జాతా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 21: సండూరు పట్టణంలోని వివిధ వార్డుల్లో బుధవారం రాజ్యాంగ అవగాహన జాతా ఘనంగా జరిగింది. సండూరు పట్టణానికి చేరుకున్న ఈ ఊరేగింపుకు మహిళలు, కలశాలు, పూర్ణకుంభాలు, డొల్లు వాద్యాలతో స్వాగతం పలికారు. ఊరేగింపులో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ సభ, రాజ్యాంగం గురించిన వీడియో క్లిప్పింగ్‌లను ప్రజలకు చూపించారు. ఊరేగింపు పొడవునా రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు. తాలూకా కార్యాలయం నుండి ప్రారంభమైన జాతా విజయ సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. అక్కడ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తాహసిల్దార్ అనిల్, తాలూకా పంచాయితీ ఈఓ షడక్షరయ్య, మున్సిపల్ చీఫ్ జయన్న, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది. వివిధ సంఘాల ఆఫీస్ బేరర్లు, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



జాతాలో పాల్గొన్న కళాబృందాలు

వైభవంగా ఉడుసులమ్మ కలశ ప్రతిష్ఠ



గోపురంపై కలశాలను ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 21 :కురుగోడు తాలూకా బాదనట్టి గ్రామంలోని ఉడుసులమ్మ దేవస్థానానికి నూతనంగా ధ్వజస్తంభం, నూతన కలశాలను ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారా సూర్యనారాయణ రెడ్డి, ఎమ్మిగనూరు వామదేవ శివాచార్యులు తెలిపారు. ఉదయం కలశాల ఊరేగింపు చేపట్టారు. అలాగే ప్రతి ఇంట మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఒడినింపే కార్యక్రమం చేపట్టారు. సూర్యనారాయణరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ధార్మిక కార్యక్రమాలు మరింతగా జరగాలని, అప్పుడే ప్రశాంతత నెలకొంటుందన్నారు. అలాగే పిల్లలకు దేశ సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. కురుగోడు, వడ్డట్టి, కలకంబ్ల, బళ్లారి, గంగావతి, కంప్లి, సిరుగుప్ప పట్టణాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఉడుసులమ్మదేవికి మొక్కులు సమర్పించుకున్నారు.

కుడితినికి పొంచివున్న నీటి గండం

కంప్లి, ఫిబ్రవరి 21 : జిల్లాలో పారిశ్రామిక పట్టణంగా పేరుపొందిన కుడితినికి త్వరలోనే తాగు నీటిగండం పొంచి ఉంది. సుమారు రూ.30 వేలకుపైగా జనాభా వున్న ఈ పట్టణానికి నీటిని సరఫరా చేసే చెరువులో కేవలం ఐదున్నర అడుగుల నీరు మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటికే వారానికి ఒక రోజు మాత్రమే పట్టణ పంచాయతీ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. కొంతమంది ఇప్పటికే ట్యాంక్‌కు రూ.800 రూ. 900 వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో 46 బోర్లు వున్నా అందులో సగంపైగా వాటిలో భూగర్భజలాలు ఇంకిపోగా మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. దీనికి తోడు పట్టణంలో దాదాపు 10 ఆర్వో ప్లాంట్లు వున్నప్పటికీ వాటిలో కేవలం రెండు మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. చివరకు ట్యాంకర్లను ప్రతి ఇంటి వారు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. వేసవి రాకముందే నీటి సమస్య ఇలా ఉంటే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మరింతగా ఉంటుందని, చెరువులో వున్న ఆ కాస్త నీరు కూడా ఇంకిపోయే ప్రమాదం వుందని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు జాగ్రత్తలు వహించకపోతే పట్టణానికి నీటి గండం తప్పదని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



నీటి మట్టం తగ్గుతున్నకుడితిని చెరువు

హోసూరు జోన్

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



విద్యార్థులతో మమేకమైన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 21: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అమలుచేస్తున్న విద్య, తదితర సంక్షేమ పథకాలను కలెక్టర్ సరయు బుధవారం స్వయంగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటింటికి వైద్యం, ముఖ్యమంత్రి అల్పాహారం, కళాకారిణి మహిళా హక్కుల నిధి, ప్రజలతో క్షేత్రస్థాయి అధ్యయనం తదితర పథకాల అమలు గురించి స్వయంగా ఆరా తీశారు. జిల్లా స్థాయిల్లో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉదయం 9 గంటల నుంచి మరుసటి రోజు 9 గంటల వరకు ఎంపిక చేసిన సర్కిళ్లలో వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న ప్రాజెక్టులు, సేవా కార్యక్రమాలపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. హోసూరు పంచాయతీ యూనియన్ ఒన్నలవాడీ పంచాయతీ, ఒగరపల్లి ఈ సేవా కేంద్రంలో వివిధ రకాల సర్టిఫికెట్‌ల కోసం చేసిన దరఖాస్తులు, అర్జీదారులకు ఇప్పటివరకు జారీ చేసిన వారసుల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పాలనాధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్, పట్టా, చిట్టా, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు, ఎలక్ట్రానిక్ క్రాప్ బ్యాలెన్స్ రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. అలాగే రూ.13.57 లక్షలతో నిర్మించిన అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో హోసూరు ఎమ్మెల్యేల్యాడ్ క్రింద రూ.2లక్షలతో స్మార్ట్ క్లాస్‌రూం ద్వారా విద్యార్థులకు అనుగుణంగా పాఠాలు నేర్పడం, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ఆహారం, పిల్లల ఎత్తు, బరువు రికార్డు చేసే యాప్‌ను పరిశీలించారు. అలాగే రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు.

కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన

హోసూరు, ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా హోసూరు రైల్వే స్టేషన్ దగ్గర బుధవారం రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతుగా 12 ప్రముఖ డిమాండ్లను ప్రస్తావించారు. నిరసనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణన్ అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షుడు కోనప్పన్, పశ్చిమ జిల్లా అధ్యక్షుడు సిందిలింగప్ప నాయకత్వం వహించారు. ధర్మపురి జిల్లా ప్రధాన కార్యదర్శి మునియప్పన్ ప్రధాన ప్రసంగం చేశారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరల ప్రకటించాలని, ఎంఎస్ స్వామినాథన్ కమీషన్ నివేదికను అమలు చేయాలని, రైతులు, రైతుకూలీల బ్యాంకుల్లో చేసిన పంట రుణాలను మొత్తం మాఫీ చేయాలన్నారు. అలాగే రైతులకు, వ్యవసాయ కూలీలకు పింఛన్లు ఇవ్వాలని, విద్యుత్ సవరణ బిల్లు 2020ని రద్దు చేయాలని ఇలా పలు డిమాండ్లతో నినాదాలు చేశారు.

రథోత్సవానికి సన్నాహాలు

హోసూరు, ఫిబ్రవరి 21: హోసూరు చంద్రచూడేశ్వర ఆలయంలో ఈ ఏడాది మార్చి 25న జరగనున్న రథోత్సవానికి సంబంధించి పాలస్తంభం నాటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత వినాయకుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. మార్చి 18న అంకురార్పణం, 24న తిరుకల్యాణం, 25న రథోత్సవం, 26న రావణ ఉత్సవం, 27 తెప్పోత్సవం జరుగనుంది. పాలస్తంభం నాటే ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే మనోహరన్, ఆరోగ్యస్వామి సమితి అధ్యక్షుడు మాదేశ్వరన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్, కౌన్సిలర్ రాజీ, డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి రాము, సాహిత్య బృందం శక్తివేల్, మాజీ కౌన్సిలర్ రోజా పాండియన్, సూడప్ప, మురుగన్, ప్రవీణ్‌కుమార్, బాలు, మురుగన్ పాల్గొన్నారు.



పాలస్తంభంతో ఉత్సవ నిర్వాహకులు

బాల్య వివాహాలపై సుమోటో కేసుల నమోదు

- అదనపు జిల్లాధికారి అశోక్ సూచన

రాయచూరు, ఫిబ్రవరి 21 : జిల్లాలో బాల్యవివాహాలు పెద్దఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అధికారులు సుమోటో కేసులను నమోదు చేయాలని అదనపు జిల్లాధికారి అశోక్ దుడగుంటి సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఏడీసీ అశోక్ మాట్లాడుతూ, గత ఏప్రిల్ నుంచి జనవరి వరకు 58 కేసులు నమోదు కాగా 50 కేసులను పరిష్కరించినట్లు సమాచారం ఉందని మిగతా ఎనిమిది గురించి ఎందుకు పూర్తి సమాచారం లేదని ప్రశ్నించారు. అదే సమయంలో బాల్య వివాహాల నియంత్రణకు సంబంధించి తాలూకా, గ్రామ స్థాయిల్లో ప్రత్యేక కమిటీలున్నా సకాలంలో అధికారులకు సమాచారం అందడం లేదని ఇందుకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కాగా అధికారుల కళ్లుగప్పి కమిటీల దృష్టికి రాకుండా అనేక వివాహాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు.



అధికారులతో సమావేశమైన ఏడీసీ అశోక్ దుడగుంటి

సినీ అవకాశాల పేరుతో వంచన..!

రాయచూరు, ఫిబ్రవరి 21 : సినిమాల్లో హీరోయిన్‌గా అవకాశం కల్పిస్తానంటూ నమ్మబలికి ఓ యువతిని మోసగించిన సంతోష్ అనే యువకుడిపై కేసు నమోదైంది. రాయచూరుకు చెందిన యువతి తల్లిదండ్రులతో కలిసి 4 ఏళ్ల క్రితం నుంచి బెంగళూరులో నివాసముంటోంది. అదే కాలనీలో నివాసముంటున్న మరో యువకుడు ఆమెను తాను నటుడినని నమ్మించి హీరోలు, హిరోయిన్‌లతో తనకు పరిచయాలు ఉన్నాయని మంచి అవకాశం కల్పిస్తానంటూ నమ్మించాడు. యువకుడి మాటలను విశ్వసించిన యువతి తన మొబైల్ నెంబర్‌ను ఇవ్వగా తరచుగా ఫోన్‌కాల్ చేస్తూ ఆమెతో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇదంతా గుడ్డిగా నమ్మిన యువతి మోసగాడికి అత్యంత చేరువకాగా లైంగికంగా తనపై దాడి జరిపాడంటూ ఆమె పోలీసులను ఆశ్రయించింది. కాగా అప్పటికే ఆ వంచకుడికి పెళ్లి జరిగినట్లు గుర్తించిన యువతి ఇంటికి వెళ్లి గొడవ చేయగా మరుసటి రోజే తాను కూడా యువతి ఇంటికొచ్చి మిత్రులతో కలిసి గొడవ చేశాడు. దీంతో పాటు తనకు సన్నిహితంగా ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో పెడుతానంటు బెదిరించాడు. ఇందుకు సంబంధించి బెంగళూరులోని జ్ఞానభారతి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా ఈ యువతితో పాటు మరో యువతిని కూడా అతడు ఇదే రీతిలో మోసగించినట్లు విచారణలో వెల్లడైంది. మోసగాడు సంతోష్‌పై అప్పటికే మరో పోలీస్ స్టేషన్(అత్తిబెలె)లో కేసు నమోదైనట్లు గుర్తించిన పోలీసులు రెండింటిని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

కొండా వెంకటప్పయ్య (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు కొండా వెంకటప్పయ్య 1866 ఫిబ్రవరి 22న పాత గుంటూరులో జన్మించారు. ప్రత్యేక అంధ్ర రాష్ట్రోద్యమానికి ఆద్యులు, దేశభక్త బిరుదాంకితుడు. 'కృష్ణా' పత్రికను స్థాపించి తద్వారా ప్రజలను చైతన్యపరిచారు. ఆంధ్ర మహా సభకు అధ్యక్షుడు. అంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి తొలి కార్యదర్శి. గాంధీజీ ఉపసేనానుల తొలిజట్టుకు చెందిన వారు. భాషా ప్రాతిపదకన మద్రాసు రాష్ట్ర విభజనపై శాసనసభలో ఆయన ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవమైంది. తెలుగు, ఆంగ్లం భాషల్లో మంచివక్త, కవి. 1949 ఆగస్టు 15న స్వర్గస్థులయ్యారు.

పువ్వుల సూరిబాబు (జయంతి)



పువ్వుల సూరిబాబు 1915 ఫిబ్రవరి 22న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా బొమ్మ లూరు గ్రామంలో జన్మించారు. సుప్రసిద్ధ తెలుగు రంగస్థల, సినిమా నటుడిగానే కాక గాయకుడిగా నాటక ప్రయోక్తగా ప్రతిభ చాటుకున్నారు. 1944లో నటీమణి రాజరాజేశ్వరిని వివాహమాడారు. ఆమె పేరిట నాట్యమండలి స్థాపించారు. కొప్పరపు సుబ్బారావుతో 'తారా శశాంకం' నాటకాన్ని రాయించి తానే దర్శకత్వం వహించారు. 1500కుపైగా నాటకాలను ప్రదర్శించారు. భూకైలాస్, కురుక్షేత్రం, విప్రనారాయణ, తులాభారం తదితర పౌరాణిక నాటకాలను దేశ మంతా ప్రదర్శించి కీర్తిప్రతిష్ఠలు పొందారు. 1946లో మైసూరు మహారాజ దర్బారులో సత్కారం పొందారు. గజారోహణం, గండపెండేరం తదితర సన్మానాలు అం దుకున్నారు. 1968 ఫిబ్రవరి 12న కన్నుమూశారు.

కలువకొలను సదానంద (జయంతి)



ప్రముఖ బాలసాహిత్య రచయిత కలువకొలను సదానంద 1939 ఫిబ్రవరి 22న చిత్తూరు జిల్లా పాకాలలో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీచే బాల సాహిత్య పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి. వృత్తి రీత్యా 36ఏళ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి 1997లో పదవీ విరమణ పొందారు. 200కు పైగా కథలు, 2 నవలలు, వందకుపైగా గేయాలు, గేయ కథలు రాశారు. అంతేకాక 8 కథా సంపుటాలు, రెండు నవలలు ప్రచురించారు. 1976 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 2020 ఆగస్టు 25న కన్నుమూశారు.

కస్తూర్బా గాంధీ (వర్ధంతి)



కస్తూరిబాయి (కస్తూర్బా) గాంధీ 1869 ఏప్రిల్ 11న గుజరాత్ రాష్ట్రం పోర్‌బందరు ప్రాంతంలో జన్మించారు. భర్త మోహన్‌దాస్ కరంచంద్‌గాంధీ (మహాత్మాగాంధీ)తో కలసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా ప్రవాస భారతీయుల పోరాటంలోనూ పాల్గొని నిర్బంధాలను ఎదుర్కొన్నారు. కులమతబేధం లేకుండా స్వాతంత్ర్య సమరంలో పురుషులకు తీసిపోని విధంగా స్త్రీలు గడపదాటాలి అని ఆమె పిలుపునిచ్చారు. పోరాటాల కోసం పలుమార్లు అరెస్టు అయ్యారు. స్వాతంత్ర్యం రాకమునుపే 1944 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

వేదాంత్ మెటల్ ఇకపై ఆన్‌లైన్‌లోనూ విక్రయం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేదాంత్ అల్యూమినియం తన ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేసుకునేందుకు వీలుగా వేదాంత్ మెటల్ బజార్ పేరిట ఆన్‌లైన్‌లో విక్రయాలను ఆరంభించారు. ఈమేరకు బుధవారం బెంగళూరులో సంబంధిత కంపెనీ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. వేదాంత్ మెటల్ బజార్ ద్వారా 750 ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే వెసలుబాటు కల్పించినట్లు ప్రకటించారు. అల్యూమినియం వ్యాపారాలలో కొత్తఒరవడి తీసుకురావాలనే బజార్ పేరిట సిద్ధం చేశామన్నారు. కస్టమర్ ఫ్రెండ్లీగా ఉండాలని మొబైల్ సాధనాల ద్వారా అన్ని ప్రాంతాలకు చెందినవారు నాణ్యత, ధరలు వంటివి బేరీజు వేసుకుని ఎంపిక చేసుకునే వీలుంటుందని ప్రకటించారు. పరిశోధనా సంస్థలు, వ్యాపార సంఘాలు, విశ్వవ్యాప్తంగా నిపుణుల సమిష్టి అభిప్రాయాలకు అనుగుణంగా వేదాంత్ మెటల్ బజార్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు సీనియర్ జీఎం మనోజ్‌కుమార్‌జైన్, స్యాంట్ అల్యూమినియం అధినేత అభిషేక్ అగర్వాల్‌ల పేరిట ప్రకటన విడుదలయ్యింది.

నేటి నుంచి ఇండియావుడ్ మేళా

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొయ్యపని యంత్రోపకరణాల తయారీలో ముందంజలో బియెస్సి సంస్థ ఆధ్వర్యంలో ఇండియావుడ్ మేళా ఈనెల 22 నుంచి 26వరకు జరగనుంది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రదర్శన ఏర్పాటు కానుంది. అంతర్జాతీయస్థాయి మార్కెట్‌లో పోటీకి తగినట్టుగా వినియోగదారులకు వీలుగా పలు ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచనున్నట్టు బియెస్సి ఇండియా సీఈఓ సయాద్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు.

దాల్మియా ఆర్‌సీఎఫ్ రాయబారిగా రణవీర్‌సింగ్

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సిమెం ట్ కంపెనీ దాల్మియా రూఫ్ కాలం ఫౌండేషన్ రాయబారిగా ప్రముఖ నటుడు రణవీర్‌సింగ్‌ను నియమించినట్లు ప్రకటించింది. బెంగళూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో దాల్మియా సీఎండీ పునీత్ దాల్మియా మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల మా ప్రయాణంలో వినియోగదారుల విశ్వాసానికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఆర్‌సీఎఫ్ స్ట్రాంగ్‌తో షుర్ స్ట్రాంగ్ అనే నినాదం ఇవ్వదలచామన్నారు. ఇందుకు ప్రత్యేక రాయబారిగా రణవీర్ సింగ్‌ను ఎంపిక చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా దేశవ్యాప్తంగా ఒకేసారి కొత్త ఉత్పత్తిని మార్కెటింగ్ చేయదలచామన్నారు. కొత్తబ్రాండ్ కేవలం వారసత్వ వ్యాపారంగా కాకుండా వినియోగదారులు విశ్వాసాన్ని పొందేలా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

హిందువుల పన్నులతో నిలువుదోపిడీ

▸▸ రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ అనంతకుమార్ హెగ్డే తీవ్ర విమర్శలు

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హిందువులు చెల్లించే పన్నులతో రాష్ట్ర ప్రభుత్వం నిలువుదోపిడీ చేస్తోందని ఇటువంటి సందర్భంలో హిందువులు చెల్లించే పన్నులు వారి హక్కు అనే నినాదం రావాలని ఉత్తరకన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యానించారు. బుధవారం శిరసిలోని దీనదయాళ్ సభాంగణంలో పార్టీ కార్యకర్తల సభలో మాట్లాడారు. రాష్ట్రంలో మైనారిటీలు మాత్రమే నివసిస్తున్నారనే రీతిలో సీఎం సిద్దరామయ్య బడ్జెట్ ప్రవేశపెట్టారని మండిపడ్డారు. అలాగైతే మిగిలినవారి పరిస్థితి ఏంటన్నారు. రాష్ట్రంలో ఎక్కువమంది చెల్లించే పన్నులకు మైనారిటీలు చెల్లించే పన్నులకు వ్యత్యాసం చూపాలన్నారు. 90శాతం మంది పారిశ్రామికవేత్తలు, ఆర్థిక సంస్థలు పన్నుల రూపంలో చెల్లించే మొత్తాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కేరళ, తెలంగాణ, తమిళనాడులో బీజేపీ ప్రభుత్వాలు లేవని, అక్కడ బీజేపీ వ్యతిరేక విధానాలు పాటిస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం పన్నుల వాటాలో వ్యత్యాసం ఉందని సంబంధిత రాష్ట్రాలు వ్యతిరేకించలేదని, కానీ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య మాత్రం నిత్యం అవే మాటలు మాట్లాడతారన్నారు. స్థానిక పదాధికారులు ఆనంద్ సాలేరా, రాజేశ్ శెట్టి, చంద్రు దేవాడిగ, గురుప్రసాద్ హెగ్డే, రేఖా హెగ్డే, షర్మిలా మాదనగేరి పాల్గొన్నారు.

గంగమ్మదేవి ఆలయం ప్రారంభం

బాగేపల్లి, ఫిబ్రవరి 21: తాలూకాలోని దేవరగుడిపల్లి గ్రామపంచాయతీ సడ్లవారిపల్లి గ్రామంలో గంగమ్మదేవి ఆలయాన్ని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. చిక్కబళ్ళాపుర జిల్లా పంచాయతీ గ్రాంటు కింద రూ.5లక్షలు 2021-22లో కేటాయించగా ఇటీవల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆలయ ప్రారంభం నేపథ్యంలో గ్రామాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. పూర్ణకుంభ కళశాలతో మహిళలు, మంగళ వాయిద్యాలు, జానపద కళాబృందాలు పాల్గొన్నాయి. వేదబ్రహ్మ గణేశ్‌భట్ నేతృత్వంలో ప్రతిష్ఠాపన మహోత్సవం, ఇతరత్రా ధార్మిక కార్యక్రమాలు సోమవారం నుంచి జరుగుతు న్నాయి. గణపతి హోమం, గంగమ్మదేవికి అభిషేకం, ప్రధాన హోమం, ప్రాణఃప్రతిష్ఠాపన, శాంతి హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న సంతర్పణ నిర్వహించారు. ఉత్సవాల్లో పురసభ స్థాయి సమితి అధ్యక్షుడు నంజుండప్ప, లంబ శ్రీనివాస్, దేవరగుడిపల్లి శ్రీరామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మదేవికి విశేష అలంకరణ

కైవారలో ఉర్దూ పాఠశాల శతమానోత్సవం



పాఠశాల వార్షికోత్సవం ప్రారంభంలో ప్రముఖులు

చింతామణి రూరల్, ఫిబ్రవరి 21: తాలూకాలోని కైవార గ్రామంలో 1924లో ప్రారంభమైన ప్రభుత్వ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం, శతమానోత్సవం అత్యంత సంబరంగా మంగళవారం జరిగింది. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే అంతగా ఆసక్తి చూపరు. అలాంటిది కైవార గ్రామంలో ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్‌కు ఏమాత్రం తగ్గకుండా రాణించారు. ఇలా వందేళ్ల పూర్తి చేసుకోవడంపై పాఠశాల ఆవరణలో ఏర్పాటైప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను అలరించాయి. పాఠశాలను వివిధ రంగులతో అలంకరించారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగాలలో రాణించి రిటైరైన వారిని, గ్రామ ముస్లిం పెద్దలను ఈ సందర్భంగా ఆత్మీయంగా సత్కరించారు. విద్యాశాఖ అధికారి ఉమాదేవి, జడ్పీ మాజీ సభ్యుడు షేక్ మౌలా, గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు దాదాపీర్ తదితరులు మొక్కకు నీరు పోయడం ద్వారా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బీఈఓ రాజణ్ణ మాట్లాడుతూ ఎంతోమంది ప్రాథమిక విద్య చదివిన ఈ పాఠశాలలో తమదైన హోదాలలో రాణించారంటే అది విద్యయొక్క గొప్పతనమేనని ఇందుకు ఇక్కడ హాజరైనవారే నిదర్శనమన్నారు. గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు దాదాపీర్ మాట్లాడుతూ అన్ని అంశాలలో ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మరింత సత్తా చాటుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎంతటి గుణాత్మక విద్యను అందిస్తున్నా కొన్ని ప్రైవేట్ పాఠశాలల దుష్ప్రచారం, తదితర కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారి సంఖ్య రానురాను తగ్గుతోందని, ఈ పరిస్థితుల్లో మార్పు రావాలన్నారు. ఎండబ్ల్యుఏ పాఠశాల అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ మాట్లాడుతూ ఉత్తమ విద్యతోపాటు ఉత్తమ సంస్కారం ద్వారా మాత్రమే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. కార్యక్రమంలో కైవార గ్రామ జామియా మసీదు అధ్యక్షుడు ఎండీ యాసిన్, కార్యదర్శి షేక్ మహబూబ్, ఆర్కే నర్సింగ్ హోం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహబూబ్ పాషా, ఈరుళ్ళి నవాజ్ పాషా, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఉమాదేవి, ఉపాధ్యక్షురాలు యాస్మిన్ ముస్తఫా, ప్రముఖులు జాఫర్ సాదిక్, డాక్టర్ షఫివుల్లా, డాక్టర్ అఫ్జల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల చికిత్సల కోసం కావేరిలో ప్రత్యేక విభాగం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): క్రీడల వేళ గాయపడే వారికోసం ప్రత్యేక చికిత్సలు అందించేలాంటి ప్రత్యేక విభాగాన్ని కావేరీ ఆసుపత్రిలో లాంఛనంగా ఆరంభించారు. ప్రముఖ స్క్వాష్ క్రీడాకారిణి, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత జ్యోష్నా చిన్నప్ప ముఖ్యులుగా పాల్గొని మాట్లాడుతూ అథ్లెట్‌లు గాయపడిన వేళ వారికి సకాలంలో తగిన చికిత్సలు అవసరమన్నారు. ప్రతిచోటా ఇటువంటి ప్రత్యేక కేంద్రాలు ఉంటే క్రీడాకారులకు వేగవంతంగా కోలుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రముఖనటి, స్కూబాడ్రైవర్ సంయుక్తాహెగ్డే మాట్లాడుతూ బెంగళూరులో క్రీడల పట్ల ఆసక్తి చూపేవారు లక్షలాది మంది ఉన్నారని పలు సందర్భాలలో చికిత్సల కోసం ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రి రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ కన్సల్టెంట్ పీసీ జగదీష్ మాట్లాడుతూ కావేరీ ఆసుపత్రుల చైన్‌లింక్ దేశవ్యాప్తంగా ఉందని క్రీడాకారులకు తగిన ప్రత్యేకత కల్పించాలనే కేంద్రాన్ని తెరిచామన్నారు. ఎండీ డాక్టర్ ఎస్ విజయభాస్కరన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రత్యేక చికిత్సాకేంద్రాన్ని ఆరంభిస్తున్న జ్యోష్నాచిన్నప్ప తదితరులు

రేపు 'ధైర్యం సర్వత్ర సాధనం' విడుదల



మీడియా సమావేశంలో నటుడు వివాన్ కేకే

బంగారపేట, ఫిబ్రవరి 21: ఏఆర్ సాయిరాం దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ధైర్యం సర్వత్ర సాధనం' అనే సినిమా ఈనెల 23న శుక్రవారం విడుదల కానుందని హీరో వివాన్ కేకే వెల్లడించారు. పట్టణంలోని కనకభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 14ఏళ్లలో 18 సినిమాలకు కథ అందించిన ఏఆర్ సాయిరామ్ ప్రస్తుతం 'ధైర్యం సర్వత్ర సాధనం' సినిమా ద్వారా ఇదే తొలిసారిగా దర్శకత్వం కూడా వహించారన్నారు. ఈనెల 23న సినిమా విడుదల కానుందన్నారు. తుమకూరు జిల్లా దూరదహళ్ళిలో చోటు చేసుకున్న సంఘటన ఆధారంగా సినిమాను రూపొందించారన్నారు. 60ఏళ్లక్రితం నాటి సంఘటనలు అయినప్పటికీ 2015-17ల మధ్య కాలానికి అనుగుణంగా చిత్రీకరించినట్టు తెలిపారు. నిర్మాతగా జీ ఆనంద్‌బాబు, నటి అనుషా రై, బాలరాజ్ వాడి ప్రధాన పాత్రల్లో నటించగా వర్ధన్ తీతహళ్ళి, రామనాయక, ప్రదీప్ పూజారి, రామ్‌పవన్, నాటకరంగ కళాకారుడు అర్జున్ పాళేగార్ ఇతర పాత్రల్లో నటించారన్నారు. జుడా స్యాండి సంగీతం అందించగా రవికుమార్ సనా ఛాయాగ్రహణం అందించారన్నారు.

తాగునీటి వృథా నివారణకు తరుణోపాయం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతతో పాటు రాష్ట్రంలో తాగునీటికి సైతం ఎద్దడి నెలకొని ఉంది. తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు నీటి బిల్లు చార్జీలను గణనీయంగా తగ్గించుకునే తరుణోపాయాన్ని నగరంలోని అపార్ట్‌మెంట్‌లలో అమల్లోకి తెచ్చినట్లు స్మార్ట్ హోమ్స్ సిఓఓ జితేందర్ తిర్వాని ప్రకటించారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు అపార్ట్‌మెంట్‌లలో యుటిలిటీ బిల్లుల సమస్య తలనొప్పిగా మారిందని వాటర్ ఆన్ స్మార్ట్ మీటర్లను అమర్చుకోవడం ద్వారా తాగునీటి వృథాను నివారించడంతో పాటు వాటర్ బిల్లుల చార్జీలను 30 శాతం మేరకు తగ్గించుకోవచ్చునన్నారు. ఇవి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సాంకేతిక ఆధారంగా పనిచేస్తాయన్నారు. ప్రత్యేకించి ఈ విధానం అపార్ట్‌మెంట్‌లకు ఎంతో అనువుగా ఉంటుందని ఇందులో ఒక ఇంట్లో ఎంతనీరు వినియోగించారో అందుకు మాత్రమేచార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాటర్ ఆన్ స్మార్ట్ మీటర్ మొబైల్ అప్లికేషన్‌తో అనుసంధానం కలిగి ఉంటుందన్నారు. నగరవ్యాప్తంగా అనేక అపార్ట్‌మెంట్లలో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. బృహత్ బెంగళూరు నగర పరిధిలోని అన్ని అపార్ట్‌మెంటులలో ఈ స్మార్ట్‌మీటర్ల వాడకాన్ని అమల్లోకి తెచ్చేందుకు అధికారులతో చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి చుక్కనీటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నఆయన నీటి వృథా నివారణపై ప్రజల్లో మరింత అవగాహనకల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

29న కంటి పరీక్షా శిబిరం

చింతామణి, ఫిబ్రవరి 21: చింతామణి లయన్స్ సర్వీస్ ట్రస్టు, జిల్లా అంధత్వ నియంత్రణ విభాగం, జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమశాఖ, బీడబ్ల్యు లయన్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29న ఉచిత కంటి పరీక్షా శిబిరం జరగనుంది. బూరగమాకలహళ్ళిలోని లయన్స్ కంటి ఆసుపత్రి ప్రముఖులు ఏఆర్ రామచంద్ర, లయన్స్ పీఎస్ ప్రేమనాథ్‌లు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29న గురువారం చింతామణి లయన్స్ కంటి ఆసుపత్రిలో నిపుణులైన వైద్యబృందం పరీక్షలు చేస్తారని అవసరమైన వారికి బెంగళూరు పశ్చిమ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించి అక్కడ ఉచితంగానే శస్త్ర చికిత్సలు కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. అవసరమైనవారికి కళ్లద్దాలు, ఔషధాలు కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రజలు తమ రేషన్‌కార్డ్, ఆధార్ కార్డ్, మొబైల్ వివరాలతో నమోదు చేసుకుని శిబిరం ప్రయోజనాలు పొందాలన్నారు.

నేడు బాధ్యతలు చేపట్టనున్న

వీరశైవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వీరశైవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన హునగుంద ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ విశ్వేశ్వరయ్య టవర్‌లోని కార్యాలయంలో గురువారం బాధ్యతలను స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్య క్రమంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖా మంత్రి శివరాజ్ తంగడగి పాల్గొంటారని నగరంలో బుధవారం విడుదలైన ప్రకటన పేర్కొంది. ఇలా దశలవారీగా వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు బాధ్యతలు స్వీకరిస్తున్నారు.

రేపు మహేశ్వరమ్మ ఆలయంలో విశేష కార్యక్రమాలు

విజయపుర, ఫిబ్రవరి 21: పట్టణంలోని 14వ వార్డులోని మహేశ్వరమ్మ దేవి సేవా అభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 23న పున్నమిని పురస్కరించుకుని విశేషపూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కృష్ణయతీంద్ర ట్రస్టు సంచాలకులు వీఎన్ వెంకటేశ్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏటా మహేశ్వరమ్మదేవి ఆలయంలో భక్తులందరి సహకారంతో విశేషపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా సద్గురు యోగినారేయణ యతీంద్ర ప్రేరణతో భగవద్గీతా దేవి పారాయణ, దాసర పదాలు, శరణ వచనాల కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30 గంటలకు ఆలయ ఆవరణలో పతంజలి యోగ శిక్షణ సమితి, సరోవర గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణ ఉంటుందన్నారు. 'బాళి గొందు బెళకు'లో భాగంగా ప్రతి నెలా ఐదుగురు ముత్తైదువులకు చీర, పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుత కార్యక్రమాలకు ఎస్ రమేశ్ స్వామి సాన్నిధ్యం వహించనుండగా పురసభ సభ్యురాలు రాధమ్మ ప్రకాశ్ ప్రారంభిస్తారన్నారు. ట్రస్టు అధ్యక్షుడు నాగరాజ్ అధ్యక్షత వహిస్తారన్నారు.



విశేష అలంకరణలో మహేశ్వరమ్మ దేవి

27 నుంచి శ్రీరామనగర్‌లో

ఉచిత ఆరోగ్య శిబిరం

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా గంగావతి తాలుకా లోని శ్రీరామనగర్‌లో ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు ఉచిత ఆరోగ్యపరీక్షా శిబిరం, నేత్ర పరీక్షా శిబిరం ఏర్పాటవుతోంది. ఈ మేరకు స్వామి వివేకానంద సేవా సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరళి బసవణ్ణ క్యాంప్‌సమీపంలోని బైబిల్ మిషన్ బెతెస్థ పాఠశాల ఆవరణలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఆరోగ్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో అన్ని ఆరోగ్య సమస్యలకు ఉచిత పరీక్షలు వైద్యుల సలహాసూచనలు లభిస్తాయని చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు. బైబిల్ మిషన్ మహాసభల్లో భాగంగా ఏర్పాటవుతున్న ఈ శిబిరానికి స్వామి వివేకానంద సేవా సంఘం, బెంగళూరు సప్తగిరి ఆసుపత్రి, మారుతి కంటి ఆసుపత్రి సహకారం అందిస్తున్నాయని ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలో హుక్కాబార్‌లకు బ్రేక్

▸▸ 21ఏళ్లు పైబడినవారికే సిగరెట్ విక్రయాలు

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా హుక్కాబార్‌లకు పూర్తిగా బ్రేక్ పెడుతూ ప్రభుత్వం నిర్ణయించింది. హుక్కాబార్‌ల రద్దుతోపాటు 21ఏళ్లలోపు యువతీ యువకులకు సిగరెట్ విక్రయాలను నిషేధించారు. శాసనసభలో పొగాకు ఉత్పత్తుల చట్టం (కోట్పా) సవరణకు బుధవారం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే హుక్కాబార్‌లను నిషేధించారు. అయితే శాసనసభలో బిల్లుకు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం 18ఏళ్ల లోపువారికి పొగాకు ఉత్పత్తుల విక్రయాలు చట్టవ్యతిరేకమనే నిబంధన ఉంది. ఈ నిబంధనలో 21ఏళ్లకు పెంచారు. బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేస్తే విధించే జరిమానాను 100 రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు పెంచారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా హుక్కాబార్‌లు నడిపితే మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు స్పష్టం చేశారు.

నారిమన్ మృతికి ప్రముఖుల సంతాపం

▸▸ అంత్యక్రియలకు హాజరు కానున్న మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి నారిమన్ (95) మృతి పట్ల మాజీ ప్రధాని దేవేగౌడ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, హెచ్‌డీ కుమారస్వామిలు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన జల వివాదాలను సుప్రీంకోర్టులో ఆయన బలంగా వాదించేవారన్నారు. నారిమన్‌తో కర్ణాటకకు అవినాభావ సంబంధాలు ఉన్నాయన్నారు. ఢిల్లీలో బుధవారం కన్నుమూసిన నారిమన్ అంత్యక్రియలకు రాష్ట్రం తరపున భారీ పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ పాల్గొనేందుకు బయల్దేరారు. దశాబ్దాలకాలంగా కావేరి జల వివాదాన్ని వాదిస్తూ వచ్చారు. ఫలితంగా రాష్ట్రానికి న్యాయం దక్కిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రత్యేకంగా పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో జరిగే అంత్యక్రియలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంబీ పాటిల్ పాల్గొంటారన్నారు.

మాజీ సైనికాధికారి

సతీమణి అదృశ్యం

▸▸ బెంగళూరులో ఫిర్యాదు



సునితా దేవి

బెంగళూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికా ధికారి సతీమణి సునితా దేవి (48) కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు బెంగళూరులోని సుద్దగుంటెపాళ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేసుకున్న పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. ఈ నెల 18న రైల్వేస్టేషన్‌కు వెళతానని బయల్దేరిన ఆమె సాయంకాలమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. చివరిసారిగా ఆమెను బన్నేరుఘట్ట రోడ్డులోని సాగర్ అపోలో ఆసుపత్రి వద్ద చూశామని సునితాదేవి మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతూ బెంగళూరులోని నిమ్హాన్స్ అపోలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ సునితా దేవి ఇంటి నుండి వెళ్ళిపోయేందుకు ప్రయత్నించారన్నారు. గులాబీ రంగు చున్నీతో నీలి రంగు సూట్‌ను ధరించి ఉన్నారని ఈమె ఆచూకీ తెలిసినవారు సుద్దగుంటెపాళ్య పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు 9480801425 నెంబరుకు సమాచారం అందించాలని పోలీసులు ప్రకటనలో కోరారు. ఈమె ఆచూకీ కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

చిలకలనేర్పు రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు డాంబరీకరణ పనుల్లో అధికారులు

చేళూరు, ఫిబ్రవరి 21: తాలూకా కేంద్రం చేళూరు నుంచి చిలకలనేర్పు వరకు సుమారు 8 కిలోమీటర్ల రోడ్డును బాగు చేస్తున్నారు. రెండు రోజులుగా డాంబరీకరణ పనులు సాగుతున్నాయి. 10మీటర్ల వెడల్పుతో రోడ్డును ఆధునీకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. మరో వారం పదిరోజుల్లో పనులు పూర్తి అవుతాయన్నారు. కొన్ని నెలలుగా దుస్థితిలో ఉన్న రోడ్డును ఎట్టకేలకు బాగు చేస్తుం డడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాంగ జాగృతి జాతా



జాథాలో పాల్గొన్న వివిధశాఖల అధికారులు తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 21: సాంఘిక సంక్షేమ శాఖ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సంయుక్తంగా రాజ్యాంగ జాగృతి జాతాలో భాగంగా బుధ వారం బైక్ ర్యాలీ నిర్వహించారు. గుమ్మనాయకనపాళ్య కోట వరకు ర్యాలీ సాగింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగంపై ఉన్న అపోహలను తొలగించడంతోపాటు మన హక్కులు, బాధ్యతలు తెలుసుకునేలా జాగృతి కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్‌లు అరవింద, ఎంకే నాగరాజు, లక్ష్మిరెడ్డి, మీనాక్షి, సంతోషకుమార్, సుదర్శన్‌బాబు, ఉషారాణి, కల్లప్ప, అమరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌కు కారు ఢీ.. ఉపాధ్యాయుడు మృతి



శివకుమార్ (ఫైల్)

చింతామణి, ఫిబ్రవరి 21: జాతీయ రహదారిపై శిడ్లఘట్ట మార్గంలో కోనపల్లి సమీపాన మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని కారు ఒకటి ఢీకొన్న ప్రమాదంలో ఉపాధ్యాయుడు జీఎస్ శివకుమార్ (50) మృతి చెందాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను బెంగ ళూరు ఆసుపత్రికి తరలించారు. అయినా చికిత్స ఫలించక బుధవారం ఉదయం కన్నుమూశాడు. శిడ్లఘట్ట తాలూకా గంజిగుంటె గ్రామంలో టీచర్‌గా పని చేసే శివకుమార్ స్వగ్రామం శిడ్లఘట్ట తాలూకా గౌడనహళ్ళి. అయితే ఇతను కొంత కాలంగా చింతామణి పట్టణంలోని అశ్విని లే అవుట్‌లో నివసిస్తున్నాడు. గంజి గుంట పాఠశాల విధులు ముగిశాక శిడ్లఘట్ట బీఈఓ కార్యాలయానికి వెళ్లి అక్కడ పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై చింతామణికి వస్తున్నాడు. చింతామణి నుంచి శిడ్లఘట్టవైపు వెళ్తున్న కారు, సదరు ద్విచక్రవాహనాన్ని ఢీ కొని పక్కనే ఉన్న పెద్దగుంతలోకి పడిపోయింది. కారు డ్రైవర్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన శివకుమార్‌కు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు అనంతరం మెరు గైన చికిత్సకోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అయినా చికిత్స ఫలించక శివకుమార్ మృతి చెందాడు. శివకుమార్ బంధువుల ఫిర్యాదు మేరకు చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.